

మనం
కడప | అన్నమయ్య

## ప్రయాణికులకు భద్రత

### ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు
### ఏఎస్ఐ సుబ్బరామచంద్ర

సిద్ధవటం, అక్టోబర్ 15 మనం న్యూస్
మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కను మ లోపల్లి శనీశ్వర గుడి సమీపాన ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ కొంతమంది ప్రయాణికులకు ఇబ్బందికరంగా చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో ఏఎస్ఐ సుబ్బరామచంద్ర ప్రయాణికులకు భద్రత కల్పించే విధంగా విధులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంలో వెళ్లే ప్రయాణికులను నిలుపుదల చేసి కొంతమంది హిజ్రాలు ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు



# క్యాడర్ గళం.. అధిష్ఠానం వినాలి!




**వైసీపీకి చెందిన ఓ నాయకుడి చేరికపై టీడీపీ శ్రేణుల అభ్యంతరం**

**పాత పరిణామాలపై సమగ్ర పరిశీలన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్**

**స్థానిక నాయకులు, మండల-గ్రామ కమిటీల అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి**

మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 15,
రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ఓ చేరిక వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి చెందిన ఓ నాయకుడు టీడీపీలోకి వచ్చే అంశంపై స్థానిక క్యాడర్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ విస్తరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని.. అయితే ఏ నిర్ణయం తీసుకునే ముందు పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్యకర్తల ఆత్మగౌరవాన్ని విస్మరించి తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో పార్టీకి ఇబ్బందిగా మారవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా పార్టీ కష్టకాలంలోనూ జెండాను మోసిన క్యాడర్‌ను విశ్వాసంలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

**గతంపై స్పష్టత ఏదీ?**

వైసీపీకి చెందిన ఆ నాయకుడి గత రాజకీయ వ్యవహారాలపై స్థానికంగా కొన్ని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో పార్టీతో ఆయనకు ఉన్న సంబంధాలు, పార్టీ నుంచి సస్పెన్షన్‌కు దారితీసిన పరిస్థితులు, అప్పటి పార్టీ నిర్ణయాలు, అనంతర రాజకీయ పరిణామాలపై అధికారిక రికార్డులను పరిశీలించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

2004 నుంచి 2024 వరకు వివిధ ఎన్నికల సమయంలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికల నాటి పరిస్థితులు, పార్టీ స్థాయిలో అప్పట్లో తీసుకున్న నిర్ణయాలు తదితర అంశాలపై వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని అంటున్నారు. ఎవరినీ ముందుగానే తప్పుబట్టడం తమ ఉద్దేశం కాదని.. ఆరోపణలు ఉంటే వాటిని అధికారిక రికార్డుల ద్వారా నిర్ధారించుకోవాలన్నదే తమ అభిమతమని కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.

**'లిమా కష్టానికి విలువ లేదా?'**

టీడీపీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్యకర్తల్లో ఇప్పుడు ఇదే ప్రధాన ప్రశ్నగా మారుతోంది. పార్టీ అధికారంలో లేని సమయంలోనూ గ్రామస్థాయిలో జెండాను మోసినవారు.. ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగినవారు.. రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొన్నవారు.. పార్టీ కోసం సమయం, శ్రమ, ఆర్థిక వనరులు వెచ్చించినవారు ఉన్నారని గుర్తుచేస్తున్నారు.

అలాంటి క్యాడర్‌ను పక్కనపెట్టి కొత్త చేరికలపై నిర్ణయాలు తీసుకుంటే కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. కొత్తవారిని ఆహ్వానించడాన్ని వ్యతిరేకించడం లేదని.. పాత కార్యకర్తల గౌరవాన్ని కాపాడుతూ నిర్ణయాలు తీసుకోవాలన్నదే తమ డిమాండ్ అని చెబుతున్నారు.

**పార్టీ బలం.. కార్యకర్తలే**

రాజకీయ పార్టీలకు నాయకత్వం ఎంత ముఖ్యమో క్షేత్రస్థాయి కార్యకర్తలు కూడా అంతే ముఖ్యమని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. డబ్బు, పదవి, పలుకుబడి కంటే పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే క్యాడర్‌నే దీర్ఘకాలిక బలంగా చూడాలని కోరుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజంపేటలో పార్టీ ఐక్యతకు ప్రాధాన్యం పెరిగిందని, ఈ సమయంలో క్యాడర్‌లో ఎలాంటి అనవసర విభేదాలు తలెత్తకుండా ముందుగానే వారి అభిప్రాయాలను తెలుసుకోవడం అవసరమని అంటున్నారు.

**అధిష్ఠానానికి విజ్ఞప్తి**

వైసీపీకి చెందిన ఓ నాయకుడి చేరికపై తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా ముందుగా స్థానిక నాయకులతో చర్చించాలని కార్యకర్తలు కోరుతున్నారు. మండల కమిటీలు, గ్రామ కమిటీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైన పార్టీ రికార్డులతో పాటు అందుబాటులో ఉన్న అధికారిక, చట్టపరమైన అంశాలను కూడా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అంటున్నారు.

'వ్యక్తికి వ్యతిరేకం కాదు.. విధానంపై ప్రశ్న' అన్నదే తమ వైఖరి అని కార్యకర్తలు చెబుతున్నారు. పార్టీ నిర్ణయాలను గౌరవిస్తూనే.. తమ ఆవేదనను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొంటున్నారు.

రాజంపేట టీడీపీలో ప్రస్తుతం వినిపిస్తున్న ఈ గళం ఒక నాయకుడి చేరికకే పరిమితం కాకుండా.. పార్టీ నిర్ణయాల్లో క్షేత్రస్థాయి క్యాడర్‌కు ఎంత ప్రాధాన్యం? సంవత్సరాలుగా పార్టీని మోసిన కార్యకర్తల అభిప్రాయానికి ఎంత విలువ? అనే ప్రశ్నలను ముందుకు తెస్తోంది. కార్యకర్తలను విశ్వాసంలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటేనే పార్టీ ఐక్యత బలోపేతమవుతుందని, కొత్త చేరికలతో పార్టీ విస్తరించడంతో పాటు పాత క్యాడర్ ఆత్మగౌరవం కూడా కాపాడాల్సిన అవసరం ఉందని టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి.

# రాజంపేట మునిసిపల్ పీఠమే లక్ష్యం

### జనసేన నేత యల్లటూరుతో టీడీపీ నేతల ముందస్తు వ్యూహాత్మక భేటీ




మనం ప్రతినిధి ?రాజంపేట అక్టోబర్ 14:
రాజంపేట మునిసిపాలిటీపై కూటమి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన పార్టీలు ముందస్తు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇందులో భాగంగానే రాజంపేట పార్లమెంట్ జనసేన సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజుతో స్థానిక మునిసిపల్ పరిధిలోని కీలక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున సమావేశమయ్యారు. ఎన్నికల వేడి మొదలవుతున్న నేపథ్యంలో జరిగిన ఈ భేటీ కేవలం మర్యాదపూర్వకమైనది మాత్రమే కాదని, క్షేత్రస్థాయి నుంచి కూటమిని పటిష్టం చేసి ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగేందుకు వేసిన కీలక అడుగని స్పష్టమవుతోంది. ఈ భేటీ వెనుక ప్రధానంగా వార్డుల కేటాయింపు, టికెట్ల పంపకంలో ఎలాంటి అసమ్మతి తలెత్తకుండా నివారించడమే ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది. స్థానిక సమరంలో టీడీపీ సాంప్రదాయ బలం, జనసేన యువశక్తి ఓట్లు నూటికి నూరు శాతం పరస్పరం బదిలీ అయ్యేలా ఇప్పటినుంచే నాయకులు, కార్యకర్తల మధ్య స్పష్టమైన సమన్వయం సాధించాలని నేతలు నిర్ణయించారు. ఈ ప్రక్రియలో పార్లమెంట్ సమన్వయకర్తగా యల్లటూరు శ్రీనివాసరాజు సమన్వయ పాత్ర అత్యంత కీలకమని భావించిన స్థానిక టీడీపీ శ్రేణులు, ఆయనతో మంతనాలు జరిపి భవిష్యత్ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.

?కూటమి మధ్య క్షేత్రస్థాయిలో విభేదాలు లేవని, మునిసిపల్ సమరంలో ఉమ్మడిగా పోరాడేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామనే బలమైన సంకేతాన్ని ప్రత్యర్థి పక్షమైన వైఎస్సార్‌సీపీకి పంపడంలో ఈ భేటీ సఫలమైంది. దొంతం శివ, శివనారాయణ చౌదరి, గుగ్గిళ్ల చంద్రమౌళి, సింగిల్ విండో చైర్మన్ మల్లగూరి మణితో పాటు పలువురు సీనియర్ నేతలు యల్లటూరుతో చర్చలు జరపడం ద్వారా పురపాలక వార్డుల్లో కూటమి విజయమే ఏకైక లక్ష్యంగా పావులు కదుపుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.




# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### మూడు రోజుల పాటు అవకాశం..
### తొమ్మిది కౌంటర్ల ఏర్పాటు-కమిషనర్ లక్ష్మీనారాయణ



రాజంపేట.అక్టోబర్.15 (మనం న్యూస్ )
రాజంపేట పురపాలక సంఘం సాధారణ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని కమిషనర్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పాటు మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకోసం మొత్తం తొమ్మిది కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుందన్నారు. వార్డుల వారీగా కౌన్సిలర్ పదవులకు, మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ చేయదలచిన అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని కమిషనర్ తెలిపారు. నిర్ణీత సమయానికి అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం




## జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, అక్టోబర్ 15 మనం న్యూస్

రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్‌ను ఆధారంగా చేసుకుని వైఎస్ఆర్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం సాయంత్రం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి... స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి... మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను జిల్లా కలెక్టర్ సమగ్రంగా వివరించారు. జిల్లాలో ఉన్న 9 అర్బన్ లోకల్ బాడీలు జిల్లా పరిషత్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ అలాగే సర్పంచ్ స్థానాల ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని 8 మున్సిపాలిటీలు మరియు 1 మున్సిపల్ కార్పొరేషన్‌లో రేపటి నుంచి అధికారికంగా ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఎన్నికలకు ముందస్తుగా చేపట్టాల్సిన ప్రీ-పోలింగ్ ప్రక్రియ అంతా జిల్లా స్థాయిలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా ప్రచురణ, ఓటర్ల రోల్స్, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, సున్నిత మరియు అతి సున్నిత పోలింగ్ కేంద్రాల వర్గీకరణ, అలాగే అవసరమైన మాన్‌పవర్ (సిబ్బంది) కేటాయింపు ప్రక్రియలను పూర్తి చేసుకున్నట్లు వివరించారు. అలాగే మున్సిపాలిటీల వారీగా వార్డుల వారీ రిజర్వేషన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు ఎంపీపీ రిజర్వేషన్లను ఇప్పటికే గెజిట్ ద్వారా ప్రకటించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా సన్నద్ధంగా ఉందని, మున్సిపల్ స్థాయి యంత్రాంగం కూడా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సర్వసద్ధం చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎటువంటి భయాలకు తావులేకుండా స్వేచ్ఛాయుత మరియు నిష్పక్షపాత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ భరోసానిచ్చారు. ప్రస్తుతం ఎలక్టోరల్ రోల్స్ అప్‌డేటెడ్ జాబితాలు అందుబాటులోకి వచ్చాయని, నేడు సాయంత్రానికి ఆ అప్‌డేటెడ్ రోల్స్‌ను సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు అందజేయడం జరుగుతుందని, ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఏదైనా సమస్య తలెత్తితే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను లేదా ప్రత్యేక సెల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అందించిన వెబ్‌సైట్ ద్వారా కూడా తగిన సమాచారాన్ని పొందవచ్చన్నారు.

**కుల ధృవీకరణ పత్రాలు మరియు నోడ్యూస్ సర్టిఫికెట్లపై ప్రత్యేక ఆదేశాలు:**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రాల కోసం మీ-సేవా కేంద్రాల ద్వారా లేదా వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ భౌతికంగా అప్లికేషన్లు పెట్టుకున్నట్లయితే, ఆ సమాచారాన్ని తమకు తెలియజేస్తే కేవలం 24 గంటల్లోనే ధృవీకరణ పత్రాలు అందేలా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అలాగే పంచాయతీ లేదా అర్బన్ లోకల్ బాడీల పరిధిలో ఎవరైనా 'నోడ్యూస్ సర్టిఫికెట్' కోరితే వెంటనే జారీ చేసేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా ఎన్నికల అధికారులను లేదా ప్రత్యేక సెల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ ఎన్నికలను విజయవంతం చేయడానికి పోటీ చేసే అభ్యర్థులు, ఓటర్లు అందరూ నిబంధనలకు కట్టుబడి అధికారులకు పూర్తిగా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆర్వోలు, ఏఆర్వోలకు ఇప్పటికే తగిన శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణ మరియు సమీక్షా సమావేశాల ద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు.

# గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యరక్షణే ధ్యేయం

## అనంతరాజుపేట లో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన మాజీ ఎంపీటీసీ బండారు మల్లికార్జున





రైల్వే కోడూరు రూరల్, అక్టోబర్ 15, మనం న్యూస్

అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే కోడూరు మండలంలోని అనంతరాజూపేట గ్రామంలో గ్రామ పెద్దలు మరియు మాజీ ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జున ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. 'అమెరికన్ లేజర్ హాస్పిటల్, తిరుపతి' వారి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 100 మంది గ్రామస్థులు పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో తీవ్ర కంటి సమస్యలతో బాధపడుతూ, శస్త్రచికిత్స అవసరమైన 27 మందిని వైద్యులు గుర్తించడం జరిగిందని,గుర్తించిన ఈ 27 మంది రోగులను తిరుపతిలోని హాస్పిటల్‌కు ఉచితంగా తీసుకెళ్లి, అవసరమైన కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, తిరిగి వారి స్వగ్రామానికి చేర్చనున్నట్లు బండారు మల్లికార్జున తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, నిరుపేదలకు ఉచితంగా వైద్య సహాయం అందించడంలో ఇటువంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం భవిష్యత్తులో కూడా ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ముద్దపోలు రామసుబ్బయ్య, సింగిరి రాజా, సింగిరి మురళి, గ్రామ యువత పాల్గొన్నారు.

# పురపాలక పోరుకు వేళాయె.. నామినేషన్ల ఘట్టంపై కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పెషల్ ఫోకస్!




మనం ప్రతినిధి మదనపల్లె అక్టోబర్ 15: అన్నమయ్య జిల్లాలో స్థానిక పురపాలక సమరానికి రంగం సిద్ధమైంది. అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే నామినేషన్ల స్వీకరణ ఘట్టం అత్యంత కీలకమైనది కావడంతో, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప??ష్ట బందోబస్తు, పారదర్శక ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ క్షేత్రస్థాయిలోకి దిగి ఎన్నికల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ?గురువారం మదనపల్లె దొంతి లేఅవుట్ (మున్సిపల్ వెహికల్ పార్కింగ్ ఏరియా) వద్ద నూతనంగా నిర్మించిన అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ భవనాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వార్డుల వారీగా కేటాయించిన నామినేషన్ గదులు, ఏర్పాటు చేసిన బారికేడ్లు, రికార్డుల భద్రత, పోలీస్ పహారా తీరును అంగుళం అంగుళం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఏర్పాట్ల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.

నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ సమయంలో రాజకీయ ఒత్తిళ్లు, ఉద్రిక్తతలకు ఆస్కారం లేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు తేల్చిచెప్పారు. విధుల్లో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని హెచ్చరిస్తూ, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమస్యాత్మక వార్డులపై ముందస్తు నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్‌డీసీలు చంద్రశేఖర్ రెడ్డి, మాధవ కృష్ణారెడ్డి, కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిధిలో కార్పొరేషన్లు లేనప్పటికీ, నాలుగు కీలక పురపాలక సంఘాల్లోని 119 వార్డుల కైవసమే లక్ష్యంగా పార్టీలు వ్యూహాలు రచిస్తుండటంతో పట్టణాల్లో రాజకీయ సెగ మొదలైంది. జిల్లాలో అతిపెద్ద వాణిజ్య హబ్ అయిన మదనపల్లె (35 వార్డులు), జిల్లా కేంద్రమైన రాయచోటి (34వార్డులు), రాజకీయంగా క్రియాశీలకమైన రాజంపేట (29 వార్డులు), కర్ణాటక సరిహద్దు పట్టణం బీ.కొత్తకోట (21 వార్డులు) పరిధిలో ప్రత్యేక కేంద్రాలు తెరుచుకోవడంతో ఆశావహుల హడావుడి ఊపందుకుంది. కలెక్టర్ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తం కావడంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.



# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోండి

ముద్దనూరు అక్టోబర్ 15 మనంన్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ముందస్తు చర్యలలో భాగంగా సమస్యాత్మక గ్రామమైన కోడిగాండ్ల పల్లె గ్రామంలో కార్డెన్ సర్చ్ సిఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గ్రామంలో విస్తృత తనిఖీ చేపట్టి పత్రాల పరిశీలన నిమిత్తం 15 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను తనిఖీ చేసినట్లు సిఐ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, సాధారణ ప్రజలుఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని, వివాదాలకు దూరంగా ఉండాలని ఘాటుగా కౌన్సిలింగ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి,గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



ముద్దనూరు,అక్టోబర్ 15,మనం న్యూస్:స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం ఆవరణలో గురువారం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై తహసీల్దార్, ఎండి అలీ ఖాన్,ఎంపీడీవో రాధాకృష్ణ వేణి, సిఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయడం, ఓటర్ల రాకపోకలను క్రమబద్ధీకరించడం, రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకోవడంపై సమీక్షించి, సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లపై ఈ సమావేశంలో సమర్పించారు. పోలీసు, రెవెన్యూ, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో, ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందిని ముందుగానే గుర్తించి సంబంధిత అధికారులు నియమించాలని సూచించారు. పోలింగ్ రోజుకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు లారీ బోల్తా తప్పిన ప్రమాదం



ముద్దనూరు అక్టోబర్ 15 మనం న్యూస్: కడప - తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారి మండలంలోని విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి పల్టీలు కొడుతూ పంట పొలాలకు దూసుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కడప వైపు నుంచి జెఎస్డబ్ల్యూ స్టీల్ లోడుతో తాడిపత్రి వైపు వెళుతూ ప్రమాదవశాత్తు ఘటన చోటు చేసుకోవడంతో లారీ డ్రైవర్ ఇరుక్కుపోవడంతో స్థానికులు 108 సిబ్బంది అతి కష్టం మీద లారీ డ్రైవర్‌ను బయటకు తీసి హుటా హుటిన ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

# లలితాదేవి అలంకరణతో విజయదుర్గాదేవి



సిద్ధవటం, అక్టోబర్ 15 మనంన్యూస్: మండలంలోని సాయి నగర్ గ్రామంలో శ్రీ భద్రావతి భావనారాయణ సీతా రామ లక్ష్మణ ఆలయంలో దేవి శరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా ఐదవరోజు భక్తులకు దుర్గామాత లలితా దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చింది ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమర్నాథ్ శర్మ మాట్లాడుతూ దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి విశేషమైనటువంటి పూజలు నిర్వహించామన్నారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు




# రైల్వేకోడూరు నియోజకవర్గంలో స్థానిక సమరం

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారు

రైల్వేకోడూరు, అక్టోబరు 14, మనం న్యూస్
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఎంపీటీసీ మరియు జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లను అధికారులు అధికారికంగా విడుదల చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రిజర్వేషన్ల వివరాలు మండలాలు మరియు గ్రామాల వారీగా ఈ క్రింది విధంగా ఉన్నాయి:

రైల్వేకోడూరు మండలం:
జనరల్: చియ్యవరం, మాధవరంపోడు, రైల్వేకోడూరు 1, 2, 5, 6.
జనరల్ మహిళ: మైసూరివారిపల్లె, శెట్టిగుంట, రెడ్డివారిపల్లె, ఓబనపల్లె 1, 2, రెడ్డివారిపల్లె, రైల్వేకోడూరు 4.
బీసీ మహిళ: అనంతరాజుపేట, ఎస్.కొత్తపల్లె, ఊర్లగట్టుపోడు.
బీసీ: రైల్వేకోడూరు 3, 7.
ఎస్సీ మహిళ: రైల్వేకోడూరు 8, రాఘవరాజపురం.
ఎస్సీ: బుడుగుంటపల్లె, వీపీఆర్ కండ్రిక.
ఎస్టీ మహిళ: అనంతరాజుపేట 2, కుక్కలదొడ్డి.

2. ఓబులవారిపల్లె మండలం:
అన్ రిజర్వుడ్ (జనరల్): బాలిరెడ్డిపల్లె, ఓబులవారిపల్లె 1, 2, పెద్దఓరంపాడు.
అన్ రిజర్వుడ్ మహిళ: వై.కోట 1, గోవిందంపల్లె, చెన్నరాజుపోడు, బొమ్మవరం.

ఎస్సీ మహిళ: చిన్నంపల్లె, వై.కోట 2, ముక్కావారిపల్లె, కోర్లకుంట.
ఎస్టీ: బోటిమీదిపల్లె.
బీసీ మహిళ: చిన్నఓరంపాడు, మంగంపేట.
బీసీ జనరల్: గాదెల.

3. పెనగలూరు మండలం:
జనరల్: పొందలూరు, పెనగలూరు 1, 2, ఓబిలి.
జనరల్ మహిళ: కట్టావారిపల్లె, నల్లపురెడ్డిపల్లె.
ఎస్సీ: కొండూరు 2, అనంతంపల్లె.
బీసీ జనరల్: ఈటమార్పురం.
బీసీ మహిళ: సింగారెడ్డిపల్లె.

4. పుల్లంపేట మండలం:
జనరల్: వత్తులూరు, పుల్లంపేట, జాగువారిపల్లె.
జనరల్ మహిళ: టి.కమ్మపల్లె, కొత్తపేట, బావికాడపల్లె.
బీసీ: రంగంపల్లె, దళవాయిపల్లె.
బీసీ మహిళ: అనంతసముద్రం.
ఎస్సీ: రామసముద్రం.
ఎస్సీ మహిళ: అప్పారాజుపేట.

5. చిట్వేలి మండలం:
జనరల్: నగరిపాడు, తిమ్మయ్యగారిపల్లె, చిట్వేలి 2.
జనరల్ మహిళ: కేఎస్ అగ్రహారం, మైలపల్లె, కంపసముద్రం.
బీసీ: తుమ్మకొండ.
బీసీ మహిళ: రాజకుంట, చిట్వేలి 1.
ఎస్సీ మహిళ: నాగవరం, మాలేమార్పురం.
ఎస్టీ: సీఎంరాచపల్లె.

జెడ్పీటీసీ స్థానాల కేటాయింపు వివరాలు:
జనరల్: రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి.
జనరల్ మహిళ: ఓబులవారిపల్లె, పెనగలూరు.

మొత్తంగా ఈ నియోజకవర్గ పరిధిలో 36 ఎంపీటీసీ స్థానాలను కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఈ రిజర్వేషన్ల ప్రకారం తమ సన్నాహాలు ప్రారంభించవచ్చు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు

### సిద్దవటం ఎస్సై హారిక హెచ్చరిక



సిద్దవటం, అక్టోబర్ 15 (మనం న్యూస్) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎస్సై హారిక హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయం లో రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా ఇతరులను కించపరిచేలా, కులమతాల మధ్య విభేదాలు సృష్టించేలా, వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసేలా పోస్టులు, వ్యాఖ్యలు చేయరాదన్నారు. తప్పుడు వార్తలు, నిరాధార ఆరోపణలు ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మి, నిర్ధారణ చేసుకోకుండా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా ఉపేక్షించేది లేదని ఎస్సై హారిక హెచ్చరించారు.

# సిద్ధవటం ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు



సిద్ధవటం, అక్టోబర్ 15 మనం న్యూస్ : 2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సిద్ధవటం మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి వెల్లడించారు. సిద్దవటంలో గురువారం ఆమె మాట్లాడుతూ బొగ్గిడివారిపల్లి స్థానం ఎస్సీ మహిళకు, జంగాలపల్లి, మాచుపల్లి స్థానాలు ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. మాధవరం-2 బీసీ మహిళకు, పెద్దపల్లె బీసీ జనరల్‌కు కేటాయించారు. సిద్ధవటం, మాధవరం-1, టక్కోలు స్థానాలు అన్‌రిజర్వ్‌డ్ మహిళలకు, వంతాటిపల్లె, పొన్నవోలు, ఉప్పరపల్లి స్థానాలు అన్‌రిజర్వ్‌డ్ జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు.

# శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు భద్రకాళి అమ్మవారు





చిట్వేలీ అక్టోబర్ 15 మనం న్యూస్: శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు మండలంలోని స్థానిక పాత చిట్వేలీ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు భద్రకాళి అమ్మవారు దర్శనం ఇచ్చారు. ముందుగా ఆలయ అర్చకులు మృత్యుంజయ అమ్మవారిని వివిధ పుష్పాలతో, పట్టు వస్త్రాలతో, ఆభరణాలతో చెరుకు గడ్డలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి రూపాన్ని దర్శించుకుని పునీతులయ్యారు. ఐదవ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకారం శక్తి సౌందర్యం, కరుణకు ప్రత్యేక ప్రొద్దుటూరు కి చెందిన జింక సంజీవ్ కుమార్ కుటుంబ సభ్యులు అలంకార ఉభయ దారులుగా నిలిచారు. అనంతరం ఆలయ పెద్దలు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందించారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఐదవ రోజు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు




రైల్వే కోడూరు, అక్టోబర్ 15 మనం న్యూస్ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలోని పాత బజార్‌లో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన గురువారం అమ్మవారు విశేషమైన గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారని రైల్వే కోడూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, ధూపదీప నైవేద్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీదేవి స్వరూపమైన గజలక్ష్మి అవతారంలో మంగళకరంగా, తేజోవంతం గా దర్శనమిచ్చిన జగన్మాతను దర్శించుకునేందుకు స్థానిక భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. గజలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం వల్ల అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, విజయాలు సిద్ధరిస్తాయని భక్తుల విశ్వాసం. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలో జరుగుతున్న ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

# స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

### భద్రతా ఏర్పాట్లపై అధికారులకు జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా సూచనలు



కడప, అక్టోబర్ 15 మనం న్యూస్ : మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కడపలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మూడు స్ట్రాంగ్ రూమ్‌లు, మూడు ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి, ఎన్నికల సామగ్రి భద్రత, కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ పరిశీలనలో జేసితో పాటు కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, కడప డీఎస్పీ టి. భవానీ పాల్గొని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

# ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్-డీఎఫ్ఓ చిదానంద



చిట్వేలి అక్టోబర్ 15 మనం న్యూస్: చిట్వేల్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని సబ్-డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ చిదానంద సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్-డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, ఐఎఫ్ఎస్ చిదానంద చిట్వేల్ రేంజ్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి, చిట్వేల్ రేంజ్ అటవీ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అటవీ సంరక్షణ, అటవీ ఆక్రమణల నివారణ, ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, అటవీ నేరాల నియంత్రణ, వన్యప్రాణుల సంరక్షణ, వన్యప్రాణులకు సంబంధించిన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించి, అటవీ వన్యప్రాణుల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్వేల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.ధీరజ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు పి.శ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సావిత్రి, సుబ్బయ్య, చెంగమ్మ, కరీముల్లా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తోట ఉత్సవం"లో ఒంటిమిట్ట శ్రీ వాసవి మాత"

ఒంటిమిట్ట.అక్టోబర్ .15( మనం న్యూస్) : ఒంటిమిట్ట మెయిన్ బజార్లో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగు తున్నాయి అందులో భాగంగా 5వ రోజు గురువారం "తోట ఉత్సవం"లో వాసవి మాత" శ్రీమోహిని దేవి" అలంకారంలో వన విహారం చేస్తూ దర్శనమిచ్చారు. రాత్రి 9 గంటలకు మంత్రపుష్పం, దశ హారతులతో మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.ఉదయం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి శాస్త్రోక్తంగా ఏలేశ్వరం.గురుదీక్షిత్‌శర్మ పంచామృత అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ దారుల ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్రనామ అష్టోత్తర కుంకుమార్చన,నివేదన ,మంగళహారతి నిర్వహించడం జరిగింది.

